క్లుప్తంగా

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



వెంకటయ్య (ఫైల్)

ఐనవోలు: పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని లింగమోరిగూడెంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై వంగాల నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రంగు వెంకటయ్య(72) అనారోగ్య కారణాలతో బాధపడుతూ గురువారం రాత్రి పురుగుల మందు సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా శుక్రవారం రాత్రి పరిస్థితి విషమించి వెంకటయ్య చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమారుడు రంగు మధుకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఏకగ్రీవ తీర్మానం

కమలాపూర్: మండలంలోని ఉప్పల్‌ను నూతన మండలంగా ఏర్పాటు చేయాలని కోరుతూ మండలంలోని ఉప్పలపల్లి గ్రామ పంచాయతీ పాలకవర్గం ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఈ మేరకు సర్పంచ్ బొల్లెపల్లి ఉమాదేవి అధ్యక్షతన శనివారం జరిగిన పాలకవర్గ సమావేశంలో పలు అంశాలపై చర్చించిన సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఉపసర్పంచ్ గుండెకారి శ్రీనివాస్, వార్డు సభ్యులు ర్యాకం లావణ్య, బూర్గుల శ్రీలత, చేపూరి సారమ్మ, గాజుల శ్రీనివాస్, బాషవేన సుగుణ, ఆకుల పుష్పలీల, కార్యదర్శి పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

శాయంపేట : అంబేడ్కర్ విద్యార్థి సమాఖ్య(ఏబీఎస్ఎఫ్) నూతన మండల కమిటీని శనివారం ఆ సంఘం హనుమకొండ జిల్లా కన్వీనర్ నాగుల పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా తూర్పాటి రాజుకుమార్, ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ నజీర్, ఉపాధ్యక్షులుగా అంబాల లక్ష్మణ్, ఉదారి శ్రీరామ్, సహాయ కార్యదర్శిగా మేకల అరుణ్‌కుమార్, అధికార ప్రతినిధిగా పల్లబోయిన అభివర్ధన్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. తమ ఎన్నికకు సహకరించిన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేష్, జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌కు నూతన కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు దళితబంధుపై అవగాహన

దామెర: మండల కేంద్రంలోని ఏఎస్ఆర్ గార్డెన్‌లో పరకాల నియోజకవర్గ స్థాయి దళితబంధు అవగాహన సదస్సును ఆదివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కాసర్ల రవీందర్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే ఈ సదస్సు ఉదయం 9 గంటలకు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్యలు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. రెండో విడుత దళితబంధు లబ్ధిదారులు హాజరు కావాలని కోరారు.

చర్య తీసుకోవాలని వినతి



శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక మీసేవ కేంద్రంపై చర్య తీసుకోవాలని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ అర్షం రంజిత్ కోరారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ సుభాషినికి వినతిపత్రం అందించారు. మీసేవ కేంద్రంలో కులం, ఆదాయం ధ్రువీకరణ పత్రాల ఆన్‌లైన్‌కు అధిక డబ్బులు తీసుకుంటున్నారని వినతిలో పేర్కొన్నారు. ప్రైవేట్ బ్యాంకింగ్ సేవలు నిర్వహిస్తూ కమీషన్ కేంద్రంగా మారుస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు సేవలు అందించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

కమలాపూర్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు పెరుమాండ్ల పరుశరాములు డిమాండ్ చేశారు. స్థానిక అంబేడ్కర్ కూడలి వద్ద టీడీపీ మండల శాఖ ఆధ్వర్యంలో చంద్రబాబుకు మద్దతుగా మోత మోగిద్దాం పేరిట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊరూరా పోస్ట్ కార్డు ఉద్యమం, పాదయాత్రలు చేపట్టి ప్రజలను చైతన్య పరిచి చంద్రబాబును వెంటనే విడుదల చేయాలని పోస్ట్ కార్డులను సెంట్రల్ జైలుకు పంపిస్తామన్నారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. అల్లాటి ధర్మారావు, యాంసాని రాజు, కస్తూరి ముత్యాలు, శనిగరపు రవీందర్, బండి రాజకిశోర్, తిరుపతిరెడ్డి, ఆనందం, శ్రీను, జయరాజు పాల్గొన్నారు.

గౌడ గర్జనకు తరలిరావాలి

ఐనవోలు: నేడు హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న గౌడ గర్జన సభకు మండలంలోని గౌడలు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్ శనివారం ప్రకటనలో పిలుపునిచ్చారు. పార్టీలకు అతీతంగా ప్రతీ ఇంటి నుంచి గౌడలు సభకు హాజరు కావాలని కోరారు.

అంగన్‌వాడీల డిమాండ్లు నెరవేర్చాలి

- కొనసాగుతున్న నిరసన
- మద్దతు తెలిపిన పలు పార్టీల నాయకులు



ధర్మసాగర్ : భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది



ఐనవోలు : మాట్లాడుతున్న నమిండ్ల శ్రీనివాస్

ఐనవోలు: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్లు చేపట్టిన నిరసన కొనసాగుతోంది. ఈ మేరకు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట 20 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్న అభ్యర్థి నమిండ్ల శ్రీనివాస్ శనివారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయం అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సమ్మెట మహేందర్, చిరంజీవిరెడ్డి, కొత్తూరు సునీల్, వెంకటనారాయణ, ఇల్లందుల ఎలిషా, ప్రతాప్, రాజిరెడ్డి, రాజు, ఎండీ రహీంఖాన్, రాజయ్య, ఆనందం, శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్ ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ధర్మసాగర్: తమ సమస్యలను పరిష్కరించి డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు శనివారం భిక్షాటన చేసి నిరసన తెలిపారు. అనంతరం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మనెంట్ చేసి, కనీస వేతనం రూ. 25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలోని అంగన్‌వాడీ ఉద్యోగులకు గ్రాట్యూటీ చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ. 10 లక్షలు, హెల్పర్లకు రూ. 5 లక్షలు చెల్లించాలన్నారు. వేతనంలో సగం పెన్షన్‌గా నిర్ణయించాలని, 50 సంవత్సరాల తర్వాత అంగన్‌వాడీ ఉద్యోగులు వాలంటరీ రిటైర్మెంట్ కోరితే బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమా సౌకర్యం రూ. 5 లక్షలు చెల్లించాలని, ఎస్సెస్సీ అర్హత ఉన్న హెల్పర్లకు ప్రమోషన్ కల్పించాలన్నారు. అంగన్‌వాడీల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంగన్‌వాడీ టీచర్లు వసంత, బేబీరాణి, సుజాత, ప్రేమలత, స్వరూప. స్వర్ణలత, ఆయాలు పాల్గొన్నారు.

పారదర్శకంగా రుణాల మంజూరు



ట్రాక్టర్‌ను నడుపుతున్న డీసీసీబీ చైర్మన్

ఐనవోలు: సామాన్య రైతు ఎవరికి కమీషన్లు ఇవ్వకుండా నేరుగా సొసైటీ, డీసీబీ బ్యాంకు బ్రాంచ్‌ల్లో సంప్రదిస్తే అత్యంత పారదర్శకంగా రుణాలు అందిస్తున్నామని నందనం సొసైటీ అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అన్నారు. ఒకే సంవత్సరం రూ.350 కోట్లు రుణాలు పంపిణీ చేసి ఇటీవల జాతీయ స్థాయిలో బెస్ట్ క్రెడిట్ గ్రోత్ అవార్డు తీసుకున్నట్లు పేర్కొన్నారు. నందనం రైతు సేవా సహకార సంఘంలో 50వ మహాజన సభ సమావేశం సంఘం ఉపాధ్యక్షుడు తక్కళ్లపెల్లి చందర్‌రావు అధ్యక్షతన శనివారం నిర్వహించగా జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు హాజరయ్యారు. ముందుగా సొసైటీ సీఈఓ సంపత్‌కుమార్ ఆరు నెలల ప్రగతి నివేదికను రైతులకు చదివి వినిపించారు. సొసైటీ ద్వారా క్రాప్, బంగారు, కర్షక మిత్ర, మార్టిగేజ్ లోన్‌లు అందిస్తున్నట్లు వివరించారు. అనంతరం రవీందర్‌రావు మాట్లాడుతూ నందనం సొసైటీలో బాధ్యతలు చేపట్టినపుడు సొసైటీ సీ గ్రేడ్‌లో ఉండగా నిధులు ఇవ్వడానికి బ్యాంకులు ముందుకు రాలేదన్నారు. అందరి సహకారంతో ఏ గ్రేడ్‌కు తీసుకువచ్చి ఇప్పటి వరకు రూ. 3.28 కోట్ల రుణాలు రైతులకు అందించామన్నారు. జిల్లా బ్యాంకు ద్వారా సొసైటీకి మరో 2 కోట్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఏ గ్రేడ్ సొసైటీ కావడంతో అతి తక్కువ వడ్డీ రేటుకు నాబార్డు నిధులు అందించగా మార్టు గోదాంల నిర్మాణం, ఫంక్షన్‌హాల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నెల రోజుల్లో డీసీబీ బ్యాంకు ఐనవోలు బ్రాంచ్‌ను ప్రారంభించి రైతులకు విస్తృత సేవలు అందించనున్నట్లు చెప్పారు. రానున్న రోజుల్లో సొసైటీ ద్వారా వరి నాటే యంత్రం, డ్రోన్‌ను ఖరీదు చేసి రైతులకు తక్కువ ధరలకే రైతులకు కిరాయికి ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అనంతరం రైతులకు సొసైటీ ద్వారా మంజూరైన క్రాప్‌లోన్లు, కర్షక మిత్ర, మార్టిగేజ్ రుణాలకు సంబంధించిన చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు మంజుల యాదగిరి, శ్రీనివాస్‌రావు, డైరెక్టర్లు శ్రీనివాస్, సమ్మయ్య, బాబు, పద్మ, ఎలేంద్ర, రాంచంద్రం, యేసోబు, చిరంజీవి, రాజ్‌కుమార్, సంపత్, నాయకులు రాజశేఖర్, యాకయ్య, ఏలియా, దేవదాసు, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

ఆత్మకూరు: మండలంలోని గుడెప్పాడ్ గ్రామపంచాయతీ ఏకగ్రీవంగా ఎన్నికై సంవత్సరాలు గడుస్తున్నా ప్రభుత్వం ఇప్పటికీ నజరానా నిధులు మంజూరు చేయలేదని బీజేపీ మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం అన్నారు. మండలంలోని గుడెప్పాడ్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేవలం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులతోనే గ్రామం అభివృద్ధి చెందుతుందని, రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేసిందేమిలేదని విమర్శించారు. ఏకగ్రీవ పంచాయతీలకు నజరాన ఇస్తామని ప్రకటించిన సీఎం కేసీఆర్ మాటలకే పరిమితమయ్యారని విమర్శించారు. ఆర్‌టీఐ జిల్లా కన్వీనర్ ఎదులాపురం శ్రావణ్‌కుమార్, బీజేపీ మండల ప్రధానకార్యదర్శి ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు పోరెడ్డి ప్రదీప్‌రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ దినేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయాలి

ధర్మసాగర్(వేలేరు): రాష్ట్రంలో పని చేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసే విధంగా కృషి చేయాలని తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మొగిలిచర్ల శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు మండలంలోని సోడషపల్లి గ్రామంలో శనివారం ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెగ్యులరైజ్‌కు సమయం అవసరం అనుకుంటే తెలంగాణ రాష్ట్రంలోని 26 వేల మంది సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులకు వెంటనే మినిమం టైంస్కేల్ వర్తింపజేయాలని కోరారు. స్పందించిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

స్టీల్ గ్లాసుల పంపిణీ

కమలాపూర్: మండలంలోని ఉప్పల్‌లో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఉర్దూ మీడియం పాఠశాల విద్యార్థులకు వార్డు సభ్యుడు ఎర్రబెల్లి శ్రీధర్‌రావు శనివారం స్టీల్ గ్లాసులు అందించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పాఠశాల విద్యార్థులకు రాగిజావ అందిస్తుండగా జావ తాగేందుకు విద్యార్థులకు స్టీల్ గ్లాసులు అందించినట్లు ఆయన పేర్కొన్నారు. సర్పంచ్ దేవేందర్‌రావు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సంపత్‌రావు, మాజీ జెడ్పీటీసీ నవీన్‌కుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తిరుపతిరావు, రాజు, వార్డు సభ్యుడు రమేష్, పాలవేని రవి, రాంచందర్, ఉపేందర్, నరేష్, రఘు, మయాజ్ అలీ పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



బహుమతులు అందజేస్తున్న అధ్యాపకులు

కమలాపూర్: గాంధీ జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ‘స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ పాత్ర’ అనే అంశంపై శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ పుష్పలత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. గాంధీజీ సత్యం, అహింస, సత్యాగ్రహం అనే ఆయుధాలతో 200 ఏళ్లకు పైగా భారతదేశాన్ని పాలించిన బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పలు ఉద్యమాల ద్వారా ప్రజలను సంఘటితం చేశారన్నారు. చివరికి క్విట్ ఇండియా ఉద్యమం తర్వాత బ్రిటీష్ వారు రూపొందించిన భారత స్వాతంత్ర్య చట్టం 1947 ద్వారా ఆగస్టు 15, 1947న భారతదేశం స్వాతంత్ర్యం పొందిందన్నారు. గాంధీజీ జీవితచరిత్రపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రాజ్‌కుమార్, అధ్యాపకులు సాంబశివయ్య, రామదాసు, కుమారస్వామి, శోభాదేవి, యామిని, శ్రీనివాస్, సంధ్యారాణి, కళాశాల సిబ్బంది కొండయ్య, కరుణ, రమేష్, శ్వేత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా నిలుస్తాం



కమలాపూర్ : మురళి మృతదేహానికి పూలమాల వేస్తున్న రావు పద్మ

దామెర: బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని రెడ్డి సంఘం మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి భరోసా కల్పించారు. మండలంలోని ఒగ్లాపూర్‌కు చెందిన పలకల శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని శనివారం ఆయన పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రూ. 10,000 ఆర్థిక సాయం అందించారు. ఆ సంఘం జిల్లా నాయకులు మన్నెం ఇంద్రారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మన్నెం రఘుపతి రెడ్డి, రాజేందర్ రెడ్డి, మన్నెం జైపాల్‌రెడ్డి, గోగుల రాజేందర్‌రెడ్డి, మన్నెం రాజేందర్ రెడ్డి, పలకల సంపత్‌రెడ్డి, అనంతరెడ్డి, సాంబరెడ్డి, నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

కమలాపూర్: మండలంలోని మర్రిపల్లిగూడెంకు చెందిన బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా నాయకుడు పాక మురళి మృతి చెందగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ శనివారం మురళి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మురళి అకాల మరణం బాధాకరమని అన్నారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. పార్టీ పరంగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మురళి మృతి తమను కల్చివేసిందని, అతని మృతి తీరనిలోటని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దేశిని సదానందంగౌడ్, మండల అధ్యక్షుడు కట్కూరి అశోక్‌రెడ్డి, నాయకులు ఇనుగాల రత్నాకర్, బోగి భిక్షపతి, ఇనుగాల రవి, మహంకాళి రమేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.26.38 లక్షలు



హుండీ లెక్కింపును పరిశీలిస్తున్న సంజీవరెడ్డి

ఐనవోలు: ఐనవోలు మల్లిఖార్జున స్వామి దేవాలయంలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని దేవాదాయ శాఖ డివిజినల్ పరిశీలకులు జి.సంజీవరెడ్డి పర్యవేక్షణలో శనివారం నిర్వహించారు. ఆగస్టు 11 నుంచి సెప్టెంబర్ 30 వరకు 50 రోజులకుగాను హుండీల్లో రూ. 3,72,263 నగదు, వివిధ టికెట్ల ద్వారా రూ.22,65,874, మొత్తం రూ.26,38,137 ఆదాయం సమకూరినట్లు ఈఓ నాగేశ్వర్‌రావు తెలిపారు. సెప్టెంబర్ 30తో రూ.2000 నోట్లు రద్దు కానున్న నేపథ్యంలో ప్రత్యేక హుండీ లెక్కింపు చేపట్టామన్నారు. హుండీల్లోని వెండి, బంగారాన్ని యథావిధిగా హుండీలోనే వేసి సీల్ చేశామన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ రోహిత్‌కుమార్

కమలాపూర్: మండలంలోని ప్రజలు ఇంటి ఆవరణంలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ బొనగాని రోహిత్‌కుమార్ అన్నారు. మండలంలోని శనిగరం, లక్ష్మీపూర్, గోపాల్‌పూర్ గ్రామాల్లో ఆయుష్మాన్‌భవ కార్యక్రమంలో భాగంగా శనిగరం హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం ఆయుష్మాన్ సభలు నిర్వహించి ఆరోగ్య మహిళా క్లినిక్‌పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఈ వైద్య సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో జ్వరాల తీవ్రత అధికంగా ఉన్నందున ఇంటితో పాటు ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటిని నిల్వ ఉంచకుండా ఎప్పటికప్పుడు తొలగిస్తూ దోమల వ్యాప్తిని అరికట్టాలని సూచించారు. సర్పంచ్‌లు పింగిలి రవళిరెడ్డి, లడె గోపాల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీకి రూ.25.25 లక్షల ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న కమిషనర్

పరకాల: పట్టణంలోని పశువుల సంత, గొర్రెలు, మేకల సంతల వేలం పాటల ద్వారా మున్సిపాలిటీకి రూ.25.25లక్షల ఆదాయం వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో 2023 అక్టోబర్ 10 నుంచి వచ్చే ఏడాది 2024 మార్చి31 వరకు సంత అద్దెకు ఇచ్చేందుకు శనివారం వేలంపాట నిర్వహించారు. ఈ పాటలో 10 మంది డిపాజిట్ దారులు పాల్గొన్నారు. పశువుల సంతను దొంతరవేన రమేష్ రూ.15.17 లక్షలు, గొర్రెలు, మేకలు సంతకు పాలకుర్తి ప్రభాకర్ రూ.10.5లక్షల అత్యధిక వేలంపాటలతో దక్కించుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత, వైస్ చైర్మన్ విజయ్‌పాల్‌రెడ్డి, మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బీసీకి బదులు ఎస్సీ సర్టిఫికెట్ జారీ

- తప్పు సవరణకు రెవెన్యూ సిబ్బంది చేతివాటం



తప్పుగా జారీ చేసిన కుల ధ్రువీకరణ పత్రం

శాయంపేట : ఉన్నత చదువులు చదువుకునేందుకు కుల ధృవీకరణ పత్రం కోసం మీ సేవలో అప్లికేషన్ చేసుకున్న దరఖాస్తుదారుడికి మీసేవ నిర్వాహకుడు, రెవెన్యూ సిబ్బంది పనితనంతో అవాక్కాడు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మైలారం గ్రామానికి చెందిన మోతే సతీష్ తన భార్య మమత ఉన్నత చదువులకు మండల కేంద్రంలోని మీసేవలో కులం, ఆదాయం, నివాస ధృవీకరణ పత్రాల కోసం గతంలో ఉన్న సర్టిఫికెట్లు, ఆధార్, రేషన్‌కార్డుతో దరఖాస్తు చేసుకున్నారు. గతనెల 8వ తేదీన కుల ధృవీకరణ పత్రం జారీ అయ్యింది. తాను మున్నూరుకాపు సమాజిక వర్గానికి చెందిన వారైతే ఎస్సీ కుల ధృవీకరణ పత్రం జారీ అయ్యిందని సదరు వ్యక్తి కంగుతిన్నాడు. వెంటనే మీసేవ నిర్వాహకులను ప్రశ్నించగా మున్నూరుకాపు బదులుగా ఎస్సీ కులమని తప్పుగా నమోదు అయ్యిందని, తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ క్రమంలో స్థానిక తహసీల్దార్ సుభాషిణి దృష్టికి తీసుకెళ్లగా ‘ఎక్కడ తప్పు జరిగిందో అక్కడే అడుగుపో, మేము ఎలక్షన్‌కు సంబంధించిన పనిలో బిజీగా ఉన్నామని’ ఫైర్ అయ్యినట్లు సదరు బాధితుడు తెలిపారు. దీంతో చేసేదిలేక క్రింది స్థాయి సిబ్బందిని వేడుకోగా సరైన సర్టిఫికెట్ జారీకి రూ.1000 డిమాండ్ చేసినట్లు తెలిపారు. పీజీ కౌన్సిలింగ్‌కు సమయం లేకపోవడంతో రూ.800 చెల్లించానని బాధితుడు వాపోయారు. ఈ విషయమై తహసీల్దార్ సుభాషిణిని వివరణ కోరగా మీ సేవ కేంద్రంలో నమోదు చేసిన విధంగా కుల ధృవీకరణ పత్రం జారీ చేశామని, తాను ఓపిగ్గా సమాధానం చెప్పినట్లు వివరించారు. క్రిందిస్థాయి సిబ్బందికి డబ్బులు ఇవ్వడం సదరు బాధితుడి పొరపాటు అంటూ తహసీల్దార్ దాటవేశారు.

రైతుల సౌలభ్యం కోసమే షెడ్ల నిర్మాణం



మాట్లాడుతున్న చైర్మన్ సంపత్‌రావు

కమలాపూర్: మండలంలోని రైతుల సౌలభ్యం కోసమే షెడ్ల నిర్మాణం చేపట్టినట్లు పీఏసీఎస్ చైర్మన్ పేరాల సంపత్‌రావు తెలిపారు. మండలంలోని గూడూరు, వంగపల్లి గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద షెడ్లు నిర్మించినట్లు తెలిపారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోదాం ఆవరణలో శనివారం 81వ సర్వసభ్య సమావేశం చైర్మన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సంపత్‌రావు మాట్లాడుతూ.. రైతుల సౌలభ్యం కోసం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కొనసాగించాలని, పెట్రోల్ పంపు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. సంఘం ద్వారా ఆఫీస్ నిర్వహణ కోసం నూతనంగా కొనుగోలు చేయనున్న భవనానికి రూ.81 లక్షలు కేటాయిస్తూ తీర్మానించామన్నారు. రైతు రుణమాఫీకి సంబంధించి ఇప్పటి వరకు 608 మంది రైతులకు రూ.3.70 కోట్లు రైతుల ఖాతాల్లో జమయ్యాయని, ఇంకా 246 మంది రైతులకు రూ.1.77 కోట్లు రావాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ సీఈఓ ఎండీ. చోటేమియా, డైరెక్టర్లు రమేష్‌బాబు, శ్రీనివాస్, సురేందర్, ఎడ్వర్డ్, రాజేశ్వర్‌రావు, కుమారస్వామి, యాదగిరి, బ్యాంకు మేనేజర్ కుమారస్వామి, సంఘ సిబ్బంది, సభ్యులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి



శాయంపేట: మాట్లాడుతున్న మంజుల



దామెర: సీమంతాలు చేస్తున్న సీడీపీఓ

దామెర: మహిళల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఎంపీపీ కాగితాల శంకర్ అన్నారు. పోషణ్‌మాసం సందర్భంగా మండలంలోని ల్యాదెళ్లలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, ప్రతిజ్ఞ, సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. మహిళల సంక్షేమం కోసం ఆరోగ్యలక్ష్మి, కేసీఆర్ కిట్, అమ్మఒడి పథకాలు ప్రవేశపెట్టారని అన్నారు. గర్భిణులు, బాలింతలు పోషకాలు పుష్కలంగా ఉన్న చిరుధాన్యాలను అధికంగా తీసుకోవాలని సూచించారు. మండలంలోని 37 అంగన్‌వాడీ కేంద్రాలకు బరువుకొలిచే యంత్రాలు అందిస్తామన్నారు. సీడీపీఓ భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ జాకీర్‌అలీ, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు గండురాము, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మావతి, జంగం రాణి, పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ సుమలత, ప్రాజెక్టు కోఆర్డినేటర్ భిక్షపతి, డాక్టర్ మంజుల, ఏపీఎం ఝాన్సీ, సర్పంచ్ కుక్క శ్రావణ్యఅనిల్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్తార్, అంగన్‌వాడీ టీచర్లు పుష్పలీల, శోభారాణి, సంధ్య, రమ, వాణి, కోమల, రజిత, ఉదయ, సరళ, వనజ తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారమైన చిరుధాన్యాలు, ఆకు కూరలు, పండ్లు, తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మంజుల, సునితారెడ్డి అన్నారు. నూర్జహన్‌పల్లి, నర్సింహులపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం పోషణ్‌మాసం చివరిరోజును ఘనంగా నిర్వహించారు. పౌష్టికాహారం, ఆకుకూరలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఆకుకూరలతో కలిగే ప్రయోజనాలను తెలిపారు. పిల్లల ఎదుగులను పర్యవేక్షించాలని సూచించారు. తల్లిపాల ప్రాముఖ్యత, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు జర్పుల మాజీభాయి, తిపురాల లక్ష్మి, ఏఎన్‌ఎం శోభ, పంచాయతీ కార్యదర్శులు తిరుపతి, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ధర్మారెడ్డికి ఓటమి తప్పదు



సమావేశంలో మాట్లాడుతున్న దేవేందర్‌రెడ్డి

పరకాల: త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో స్థానిక ఎమ్మెల్యే ధర్మారెడ్డిని ఓడిస్తామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రజలకు సేవ చేసేందుకు ధైర్యవంతుడు, నిజాయితీపరుడి కోసం కాంగ్రెస్ అధిష్టానం ఆలోచన చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీచేసే అభ్యర్థులు లేరని ఎమ్మెల్యే చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకు కాంగ్రెస్ పార్టీపై విషం గక్కుతున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో తనపై పోటీ చేసే సత్తా ఎవరికీ లేదంటూ, పోటీ చేయమంటే పారిపోతున్నారంటూ ఎమ్మెల్యే ధర్మారెడ్డి అధికారదాహం, డబ్బు అహంకారంతో మాట్లాడుతున్నారని విమర్శించారు. రానున్న రోజుల్లో గుణపాఠం తప్పదన్నారు. మాజీ ఎంపీపీ రాంమూర్తి, కౌన్సిలర్ జయమ్మ, ఎంపీటీసీ మల్లారెడ్డి, డీసీసీ చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు భిక్షపతి, రవీందర్‌రెడ్డి, చంద్రమౌళి, శంకరయ్య, రఘునారాయణ పాల్గొన్నారు.